చెన్నై జాతీయ సదస్సుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి



శంషాబాద్: తమిళనాడు రాష్ట్రం చెన్నై కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే జాతీయ సదస్సుకు శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసర్చ్ స్పాన్సర్ షిప్‌తో జరుగుతున్న ఈ జాతీయ సదస్సులో సినర్జీస్ ఫర్ వికసిత్ భారత్–2047 అన్న అంశంపై జరగనుంది. ఇందులో సామరవీందర్‌రెడ్డి 'క్లైమేట్ ఛేంజ్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండియన్ ఎకానమీ' అనే అశంపై తాను చేసిన పరిశోధన పత్రాలను ప్రజెంటేషన్ చేయడానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తన పరిశోధన ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్ బెనిఫిట్స్ అందించాలి

అత్తాపూర్: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జనార్థన్‌చారి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించుకున్న బతుకమ్మ, దసరా పండుగలకు బస్సులు ఉండే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలను ఒకేసారి ఇచ్చే ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పూజల కోసం వాహనాల బారులు



పూజల కోసం ఉంచిన వాహనాలు

బండ్లగూడ: విజయ దశమి సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన రహదారిపై ఉన్న ఆరె మైసమ్మ దేవాలయం దగ్గర పూజల కోసం వాహనాలు గురువారం ఉదయం నుంచి కిలోమీటర్ల మేర బారులు తీరాయి. జాతీయ రహదారిపై పూజల కోసం రాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. మైసమ్మ దేవాలయం నుంచి రెండు కిలోమీటర్ల మేర లారీలు పలు వాహనాలు రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు 20 మంది ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

5న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'హోలిస్టిక్ ట్రయాంగిల్ ఆఫ్ హీలింగ్ బ్యాక్ పెయిన్' అనే అంశంపై ఒడిశా యూత్ ఐకాన్–2018, బెస్ట్ ఫిజియోథెరపిస్ట్–2017 గుర్తింపు పొందిన ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్‌రంజన్ ఓజా ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

సత్తా చాటిన జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని



రాజశ్రీకి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అతిథులు

రాయదుర్గం: రాష్ట్ర స్థాయి పోటీలలో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజశ్రీ సత్తా చాటారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని సత్తా చాటింది. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలో అహింస, ప్రకృతి పట్ల ప్రేమతో సహా జాతిపిత మహాత్మాగాంధీ యొక్క విలువలు, బోధనలను వ్యక్తీకరించడంతో రాజశ్రీకి ఎల్‌బీ స్టేడియంలో రూ.5వేల నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.

జూకల్‌లో రైల్వే టెర్మినల్..!

- ఇంటిగ్రేటెడ్ కోచ్ మెయింటనెన్స్ డిపో ఏర్పాటుకు ప్రణాళిక
- ఉందానగర్–తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌ల మధ్యలో..
- జూకల్ స్టేషన్ పరిసర ప్రాంతాలకు మహర్దశ



శంషాబాద్ మండలం జూకల్‌లోని రైల్వేస్టేషన్

శంషాబాద్ రూరల్: అంతర్జాతీయ విమానాశ్రయం .. 216 అడుగుల సమతామూర్తి.. ఔటర్ రింగు రోడ్డుతో గుర్తింపు పొందిన శంషాబాద్ ప్రాంతంలో మరో బృహత్తర ప్రాజెక్టు రానుంది. మండలంలోని జూకల్ వద్ద 'మెగా కోచింగ్ డిపో' ఏర్పాటుకు దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కోచింగ్ రోలింగ్ స్టాక్ నిర్వహణలో భాగంగా ఈ డిపోను ఏర్పాటు చేయనున్నారు. ఉందానగర్–తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్యలో ఉన్న జూకల్ రైల్వే స్టేషన్‌ను రెండేళ్ల కిందట ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ గూడ్సు రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఈ స్టేషన్‌ను టెర్మినల్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు.

రూ. 614.84 కోట్ల వ్యయంతో..

జూకల్ వద్ద 'ఇంటిగ్రేటెడ్ కోచ్ మెయింటనెన్స్ డిపో' నిర్మాణం కోసం రూ. 614.84 కోట్లతో బిడ్ సమర్పించింది. భవిష్యతులో రైల్వే రద్దీ అంచనాతో మౌలిక వసతుల కల్పన కోసం ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. వందే భారత్, నమో భారత్, ఎల్‌హెచ్‌బీ, మెమూ వంటి రైళ్లు.. నిరంతరం పెరుగుతున్న రోలింగ్ స్టాక్ రైళ్ల నిర్వహణ కోసం ఇక్కడ మెగా కోచ్ డిపో ఏర్పాటు చేస్తున్నారు.

మహబూబ్‌నగర్–బెంగళూరు మార్గం..

దేశంలోని మిగతా నగరాల్లో మాదిరిగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను ఆయా నగరాల మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లను శివారు ప్రాంతాలకు పరిమితం చేయాలన్నది రైల్వే శాఖ ఉద్దేశం. ఇందు కోసం హైదరాబాద్‌ చుట్టూ మూడు రైల్వే టెర్మినళ్లను నిర్మించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డుకు మధ్యలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్–బెంగళూరు మార్గంలో ఉన్న జూకల్ వద్ద టెర్మినల్ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తున్నారు. వరంగల్ మార్గంలో ఇది వరకే చర్లపల్లి టెర్మినల్ అందుబాటులోకి తీసుకురాగా.. వికారాబాద్–ముంబయి మార్గంలో నాగులపల్లి టెర్మినల్ ఏర్పాటుకు డిమాండ్ ఉంది. నిజామాబాద్–నాందేడ్(డబిల్‌పుర్–మేడ్చల్) మార్గంలో కొత్త టెర్మినల్ ఏర్పాటు కానుంది.

300 ఎకరాల సేకరణ..

జూకల్‌లో రైల్వే టెర్మినల్ కోసం సుమారు 300 ఎకరాలు సేకరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ టెర్మినల్‌లో 18 ప్లాట్‌ఫారాలు, 12 పిట్ లైన్లు, 20 స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి నుంచి రోజూ 250 రైళ్లు, రెండు లక్షలకు పైగా రైల్వే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు.

ఈ ప్రాంతానికి మహర్దశ...

రైల్వే టెర్మినల్ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నప్పటికీ జీఓ 111 కారణంగా మండలంలోని గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామస్తులు వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. రైల్వే టెర్మినల్ ఏర్పాటుతో పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని స్థానికులు భావిస్తున్నారు. అంతే కాకుండా భూముల ధరకు కూడా పెరిగే అవకాశాలున్నాయి.

మహాత్ములకు ఘనంగా నివాళి



మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా వారి విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వారి అడుగు జాడల్లో పయనించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్, మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గాంధీ, శాస్త్రీలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పర్యాటకులతో మర్యాదగా వ్యవహరించాలి

- క్యాబ్ డ్రైవర్లు నిబంధనలు తప్పకుండా పాటించాలి
- ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య



క్యాబ్ డ్రైవర్లకు సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కనకయ్య

శంషాబాద్: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రతి డ్రైవరూ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య సూచించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్లతో ఎయిర్‌పోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డ్రైవర్లు వాహన పనితీరును పరిశీలించుకోవాలన్నారు. ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించడం వంటి అవాంఛిత కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను మన అతిథులుగా భావించి వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారికి చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. ప్రతి డ్రైవరు కూడా సాంకేతిక అవగాహనను పెంచుకోవాలని సూచించారు. అజ్ఞాత లింకులను ఓపెన్ చేయకూడదన్నారు.

కథల ఆవశ్యకతపై చిన్నారులకు అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ పరిధిలోని మురారి గృహ సముదాయంలోని పిల్లలో పుస్తక పఠనం పెంపొందించడంలో కథలు చెప్పడం అనే ఉద్దేశంతో దసరా పండుగ రోజులలో వారం రోజులు కథలు చదవడం, చెప్పడం మీద అక్కడి పిల్లలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజూ పిల్లలు గృహ సముదాయంలోని గ్రంథాలయంలో పుస్తకాలు చదివి, కథలు చెప్పటం చేశారు. పెద్దలు కూడా కథలు చెప్పి వారిని అలరించారు. చివరి రోజు ప్రముఖ చందమామ కథల రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలతో కథలు చెప్పించి వారు కూడా కథలు చెప్పారు. కథల ప్రాముఖ్యం వివరిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు రోజుకు ఒక కథ చెప్పినా అది వారి వ్యక్తిత్వం వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అక్కిరాజు శ్రీహరి, చైతన్య, ప్రియాంక పాల్గొన్నారు.

ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవా'



రాయదుర్గం: 'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎఫ్‌డీడీఐ) ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రోడ్డు, ఇతర ప్రాంతాలలో ఫ్యాకల్టీ , అధికారులు చెత్తాచెదారం, వ్యర్థాల తొలగించారు. వీరిందరినీ ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఏదో మొక్కుబడిగా చేయడం కాదని, ప్రతి ఒక్కరూ తాము నివసించే ఇల్లు, చదువుకునే తరగతిగది, ఇన్‌స్టిట్యూట్ పరిసరాలు, పనిచేసే కార్యాలయాలను పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ ముగింపు, గాంధీ జయంతిని పురస్కరించుకొని పలు రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న 'గాంధీ' చిత్ర ప్రదర్శన

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని మనూలో యూనివర్సిటీ ఫిల్మ్ క్లబ్ పర్యవేక్షణలో సర్ రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వం వహించిన ఆస్కార్ అవార్డు గెలుచుకున్న 'గాంధీ' చిత్రాన్ని ప్రదర్శించారు. యూనివర్సిటీ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మెరాజ్ అహ్మద్ ముబారక్ మాట్లాడుతూ సత్యం, అహింస, సరళత విలువలను చిత్రీకరించడంలో ఈ చిత్రం ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ మెరాజ్ అహ్మద్, డాక్టర్ జెర్రార్ అహ్మద్, ఎంఏఖుద్దూస్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్పీడ్ బ్రేకర్లు వేయించండి'

మణికొండ: నార్సింగి నుంచి మణికొండకు వచ్చే ప్రధాన రోడ్డుపై పుప్పాలగూడ సంతోష్‌నగర్ కాలనీ ప్రవేశంలో స్పీడ్ బ్రేకర్‌లు లేక రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మున్సిపాలిటీ వారికి చెప్పి వెంటనే వేయించాలని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయనకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేందర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డుపైకి కాలనీలో నుంచి వచ్చే వారు అకస్మాత్తుగా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమీషనర్‌ను కలిసి తెలిపితే నార్సింగి ట్రాఫిక్ పోలీసులు సూచించిన చోటనే స్పీడ్ బ్రేకర్‌లను వేస్తున్నామన్నారు. అందుకు ట్రాఫిక్ పోలీసులు మున్సిపాలిటీకి లేఖ రాయాలని కోరామన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.సురేందర్, కోశాధికారి ఎస్. రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయనను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నిత్యం ఎల్లప్పుడూ ప్రజల సేవలో ముందుంటూ ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. నేతలు శ్రీకాంత్‌రెడ్డి, తలారి చిన్న, మన్మోహన్‌రెడ్డి, భూషణ్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజ్యోతి యూత్ క్లబ్ కార్యవర్గం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని నవజ్యోతి యూత్ క్లబ్ నూతన కమిటీని గురువారం సాయంత్రం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంగళారం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.మురళీమోహన్, పి.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా యశ్వంత్, శ్రీకాంత్, కార్య నిర్వాహక కార్యదర్శిగా హరినాథ్, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎం.ప్రవీణ్ కుమార్, కల్చరల్ సెక్రటరీ డి.నర్సింహా రాజు, కోశాధికారిగా ఎం.వినయ్‌కుమార్, సహ కోశాధికారిగా ఎం.సాయిదీప్ నియమితులయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



శంషాబాద్: బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి గగన్‌పహాడ్ సమీపంలో రాంకీ ప్రాజెక్టు సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని(55) వ్యక్తిని వేగంగా బైక్ నడిపిస్తున్న వ్యక్తి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు షర్ట్, ఖాకీ రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు ఉంటే ఆర్‌జీఐఏ పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆనందోత్సాహాల నడుమ

దసరా సంబురం



రాజేంద్రనగర్‌లోని ఓ దేవాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్ జోన్ బృందం: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో దసరా పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల నేడుమ వైభవంగా నిర్వహించుకున్నారు. ఆయా దేవాలయాలతో పాటు మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దేవాలయాలతో పాటు స్థానిక మైదానాల్లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయ్ బలయ్ చేసుకుంటూ సందడి చేశారు. అమ్మవారి విగ్రహాలను రాత్రి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ నిమజ్జన ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమాలు శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి.



బుద్వేల్‌లో రావణ దహనోత్సవం



శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో...



మణికొండలో రావణ దహనంలో పాల్గొన్న గ్రామస్థులు



మణికొండలో రావణ దహనం



పుప్పాలగూడలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



రాజేంద్రనగర్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



పుప్పాలగూడలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు



మణికొండలో రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



మైలార్‌దేవ్‌పల్లి బాబుల్‌రెడ్డినగర్‌లో మాజీ కౌన్సిలర్ వెంకటేష్

దళితుల అభ్యున్నతికి తులసీరాం అవిరళ కృషి

రాజేంద్రనగర్: దళితుల అభ్యున్నతి కోసం మాజీ ఎంపీ వర్రీ తులసీరాం చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకులు వర్రీ లలిత్ నంద అన్నారు. రాజేంద్రనగర్‌లోని దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం తులసిరాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన వర్రీ తులసిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడుసార్లు ఎంపీగా గెలుపొంది దళితుల పక్షాన పార్లమెంటులో తన వాణిని వినిపించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామన్నారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... తులసీరాం విగ్రహ ఏర్పాటుకు కలిసి కట్టుగా అందరూ ముందుకు రావాలన్నారు. రాజేంద్రనగర్ అభివృద్ధిలో తులసీరాం పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నేతలు పంబాల రాజు, రాధాకృష్ణ, వేం వందనం, దాసరి రమేశ్, మంత్రి చంద్రశేఖర్, శ్రీకాంత్, నర్సింహ, పత్తి రాజు, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా కానుకగా జీఎస్టీ తగ్గింపు

గోల్కొండ: జీఎస్టీ తగ్గింపు ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు ఇచ్చిన పండుగ కానుక అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో జరిగిన దసరా సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశీయ ఉత్పత్తులనే కొనాలని దీన్ని వల్ల దేశీయ వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలకు ప్రోత్సాహం లభించినట్లు ఉంటుందన్నారు. విదేశీ వస్తువుల ధరలతో పోలిస్తే దేశీయంగా తయారైన వస్తువుల ధరలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రధాని ఎప్పుడు కూడా దేశీయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలను కోరారన్నారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నేడు దేశీయ పరిశ్రమలు ఎంతో ముందంజలో ఉన్నాయన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో నానల్‌నగర్, టోలిచౌకీ, లంగర్ హౌస్ తదితర డివిజన్‌లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. తమతమ ప్రాంతాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరూన్ ఫరాన్, అబ్బాస్ హుస్సేన్, తదితరులున్నారు.